క్లుప్తంగా

వినాయక ఆలయానికి శంకుస్థాపన



ఆలయ నిర్మాణానికి కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: మండలంలోని గోపాలపురం కొత్త కాలనీ వద్ద నూతనంగా నిర్మించనున్న శ్రీ వర సిద్ధి వినాయక స్వామి ఆలయానికి బుధవారం శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పాల్గొని కొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించారు.

వేంకటేశ్వరస్వామికి వైభవంగా పూజలు



వేంకటేశ్వరునికి అష్టదళపాదపద్మారాధన నిర్వహిస్తున్న వేదపండితులు

రావులపాలెం: అలివేలు మంగా పద్మావతి ఆండాళ్ సహిత వేంకటేశ్వరస్వామి 14వ వార్షిక నవాహ్నిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా పదోరోజు బుధవారం స్వామికి అష్టదళ పాద పద్మారాధన వైభవంగా నిర్వహించారు. తొలుత బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామికి ఉదయాన్నే సుప్రభాత సేవ, సహస్ర నామార్చన తదితర పూజలు నిర్వహించారు. అనంతం స్వామిని తిరుచ్చి వాహనంపై గోవిందమాలధారులు పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వాడపల్లి కమలనాథాచార్యుల ఆధ్వర్యంలో సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. ఏర్పాట్లను దేవస్థాన పాలక మండలి చైర్మన్ పడాల పెద వెంకటరెడ్డి, ఇతర సభ్యులు పర్యవేక్షించారు.

తాచుపాము హతం



సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేదిలో తాచుపాము గ్రామస్తుల చేతుల్లో బుధవారం హతమైంది. పంటకాలువ గట్టుకు చేరి కొబ్బరి ఆకుల మధ్య తిరుగుతున్న దీనిని స్థానికులు గుర్తించారు. అనంతరం దీనిని వారు హతమార్చారు.

వీరన్నబాబుకు బోనం సమర్పణ

పి.గన్నవరం: గ్రామానికి చెందిన జల్లు గంగరాజు, శ్రీతేజ నాగమణి దంపతుల ఆధ్వర్యంలో బుధవారం వీరన్నబాబు బోనాల సమర్పణ కార్యక్రమం ఘనంగా జరిగింది. తొలుత స్వామివారిని బ్యాండు, మేళాలతో గ్రామంలో ఊరేగించారు. అనంతరం గరుడేశ్వరాలయంలో బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నరేంద్రపురంలో సినిమా షూటింగ్ సందడి



సినిమా సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న దృశ్యం

పి.గన్నవరం: మండలంలోని నరేంద్రపురంలో నాలుగు రోజులుగా ఏ క్రియేటివ్ వర్క్ బ్యానర్‌పై సినిమా షూటింగ్ జరుగుతోంది. గ్రామంలోని పలు ప్రాంతాల్లో సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. హీరోయిన్ ఓరియంటెడ్‌గా తెరకెక్కనున్న ఈ సినిమాకు ఆర్ఎక్స్ 100 డైరెక్టర్ అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తున్నారు. హీరోయిన్‌గా పాయల్ రాజ్‌పుత్ నటిస్తున్నారు. అజయ్‌కుమార్ ఘోష్, శ్రావణ్‌రెడ్డి, దివ్య పిళ్లై తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నట్టు చిత్ర యూనిట్ తెలిపింది. పి.గన్నవరం, ఆత్రేయపురం తదితర ప్రాంతాల్లో సినిమా షూటింగ్ జరుగుతుంది. షూటింగ్ చూసేందుకు స్థానికులు వస్తున్నారు.

వ్యక్తి అరెస్ట్



పట్టుకున్న మద్యం సీసాలతో నిందితుడు తాతారావు

తాళ్లరేవు: గాడిమొగ పంచాయతీ లక్ష్మీపతిపురం గ్రామంలో నిర్వహించిన దాడుల్లో 135 మద్యం సీసాలతో బొమ్మిడి తాతారావు అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తాళ్లరేవు స్టేషన్ సీఐ జేవీ భవానీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిందితుడిని కోర్టుకు తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ ఎస్ఐ ఎంవీవీబీ కుమార్, హెడ్ కానిస్టేబుల్ ఎం.లక్ష్మణరావు, కానిస్టేబుల్స్ డి.శ్రీనివాసరావు, కె.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రద్ధతో ఆరోగ్యం పదిలం

- 15 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్
- వచ్చే నెల 3 నుంచి టెన్త్ పరీక్షలు
- విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలంటున్న నిపుణులు



పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్న మామిడికుదురు విద్యార్థులు

మామిడికుదురు: ప్రతి ఒక్కరికీ విద్య ఎంతో ప్రధానమైనది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుకు ఎనలేని ప్రాధాన్యం ఇస్తున్నారు. ఏడాది అంతా ఎంతో కష్టపడి చదువుకున్న విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకోని పక్షంలో ఇబ్బందులు పడే పరిస్థితి ఎదురవుతుంది. ప్రస్తుతం పరీక్షల కాలం సమీపిస్తోంది. ఈ నెల 15 నుంచి ఇంటర్ పరీక్షలు, వచ్చే నెల 3వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో పరీక్షల సమయంలో విద్యార్థులు ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలి. ఒత్తిళ్లకు, ఆందోళనలకు ఏ విధంగా దూరంగా ఉండాలి అన్న అంశాలపై విద్యార్థులకు వైద్యులు అందిస్తున్న సూచనలను పరిశీలిద్దాం.

మూడు నియోజకవర్గాల్లో పరిస్థితి ఇదీ..

పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల్లోని 11 మండలాల్లో మొత్తం 179 స్కూల్స్ ఉన్నాయి. మొత్తం 8,864 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారు. 117 ప్రభుత్వ స్కూళ్లలో 7,088 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. 62 ప్రైవేటు స్కూళ్లలో 1,776 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారు. పి.గన్నవరం నియోజకవర్గంలో 61 స్కూళ్లలో 2,925 మంది, రాజోలు నియోజవర్గంలో 55 స్కూళ్లలో 2,484 మంది, కొత్తపేట నియోజవర్గంలో 63 స్కూళ్లలో 3,455 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారు. వీరితో పాటు జూనియర్ కళాశాలల్లో వేలాది మంది విద్యార్థులు ఇంటర్ చదువుతున్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



విద్యార్థి తీసుకునే ఆహారం మనస్సుతో పాటు శరీరంపై ప్రభావం చూపుతుంది. పరీక్షల సమయంలో మానసికంగా, శారీరకంగా, ఆరోగ్యంగా, దృఢంగా ఉండాలి. పోషక విలువలు కలిగిన ఆహారం సమపాళ్లలో తీసుకోవాలి. రోజూ ఒక పండు, వారంలో రెండు రోజులు ఆకు కూరలు తినే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి. అరుగుదలకు ఇబ్బంది కలిగించే మాంసాహారానికి దూరంగా ఉండి, సాత్వికాహారాన్ని తీసుకోవడం ఉత్తమం.

– కేజే ప్రశాంత్, వైద్యాధికారి, పీహెచ్‌సీ, నగరం

తగినంత నిద్ర అవసరం



విద్యార్థులు ఒత్తిడికి దూరంగా ఉండాలి. ఒక ప్రణాళిక ప్రకారం చదువుకోవాలి. శరీరం, మనస్సు ఒక దానికొకటి అవినాభావ సంబంధం కలిగి ఉంటాయి. పరీక్షలంటేనే రాత్రి తెల్లవార్లూ చదువుకోవడమనే ఆలోచన అశాస్త్రీయం. ఎంత సమయం చదివామన్న దాని కంటే మెదడులో నిక్షిప్తమయ్యే నాణ్యతతో ఎంతసేపు చదివామన్నది చాలా ముఖ్యం. చదవడంతో పాటు రోజుకు కనీసం ఎనిమిది గంటలు నిద్ర కూడా అవసరమన్న విషయాన్ని గుర్తించాలి.

– జి.రమ్యశైలజ, వైద్యాధికారి, పీహెచ్‌సీ, లూటుకుర్రు

ఆరోగ్య సమస్యలను అశ్రద్ధ చేయొద్దు



రోజుకు విధిగా మూడు లీటర్ల నీరు తాగాలి. జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, అజీర్తి వంటివి చిన్న సమస్యలే. కానీ పరీక్షల సమయంలో ఇవి చాలా ఇబ్బందికి గురి చేస్తాయి. పెద్ద ఆరోగ్య సమస్యలు చిన్న పాటి లక్షణాలతోనే ప్రారంభమవుతాయి. విద్యార్థి గమనించిన చిన్నపాటి ఆరోగ్య సమస్యలను ఎట్టి పరిస్థితిల్లోనూ అశ్రద్ధ చేయకూడదు. వెంటనే వైద్యులను సంప్రదించాలి. సంపూర్ణ ఆరోగ్యంతో పరీక్షలకు హాజరు కావడం వల్ల మంచి ఫలితాలు సాధించవచ్చు.

– కె.స్వర్ణలత, వైద్యాధికారి, పీహెచ్‌సీ, నగరం

భారతీయ సంస్కృతిలో స్త్రీశక్తి ఎంతో ఘనం

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



రావులపాలెంలో మహిళలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి తదితరులు



ముక్కామలలో జెడ్పీటీసీ, ఎంపీటీసీలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



చెముడులంకలో మహిళా దినోత్సవ వేడుకల్లో ప్రసంగిస్తున్న జడ్జి దైవకృప



వీవీ మెరకలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న మనోహరం

రావులపాలెం: భారతీయ సంస్కృతిలో మహిళలకు ఎంతో గొప్ప స్థానం ఉందని తల్లిగా, సోదరిగా, భార్యగా, స్నేహితురాలిగా మహిళలు పురుషుల జీవితంలో ఎంతో ఘనమైన పాత్ర పోషిస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రావులపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో జగ్గిరెడ్డి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా సామాజికంగా మరింత అభివృద్ధి చెందేందుకు వీలుగా దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని నామినేటెడ్ పోస్టుల్లో 50 శాతం మహిళలకు కల్పించారన్నారు. వైఎస్సార్ సీపీలో మహిళలకు ఎప్పుడూ సముచిత స్థానం ఉంటుందన్నారు. మహిళ రక్షణ కోసం దిశ చట్టాన్ని, వైఎస్సార్ ఆసరా, చేయూత, అమ్మఒడి, జగనన్న చేదోడు తదితర పథకాలతో మహిళల అభ్యున్నతి జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా రావులపాలెం సర్పంచ్ తాడేపల్లి నాగమణి, మహిళా ఎంపీటీసీ సభ్యులను, వివిధ శాఖల్లో పనిచేస్తున్న మహిళలను దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు రాణిస్తేనే దేశ ఆర్థికాభివృద్ధి

అంబాజీపేట: పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తేనే దేశ ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ముక్కామలలో వైఎస్సార్ సీపీ నాయకుడు బండారు మల్లి ఆధ్వర్యంలో జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంపీటీసీలు వనచర్ల విజయదుర్గ, బుడితి సత్యనారాయణమ్మలను ఎమ్మెల్యే బుధవారం ఘనంగా సత్కరించారు. అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్రంలో కేంద్ర అధిపతి డాక్టర్ బి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా సత్కరించారు. స్థానిక స్త్రీల ఆస్పత్రిలో సీఈఓ ఎస్ఆర్‌కే హెవార్డురాజ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, ఎంపీటీసీ వడ్లమాని పద్మావతి పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచి బాలికలను శక్తిమంతులుగా తీర్చిదిద్దాలి

సఖినేటిపల్లి: విద్యార్థి దశ నుంచి బాలికలను శక్తిమంతులుగా తీర్చిదిద్దాలని ఎంఈవో నల్లి మనోహరం సూచించారు. బుధవారం వీవీమెరక మధ్యగ్రూపు ప్రాథమిక పాఠశాలలో మండల స్థాయిలో వివిధ పాఠశాలలకు చెందిన మహిళా ఉపాధ్యాయినులు అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఎంఈవో మనోహరం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పిల్లలకు పాటల పోటీలు, వకృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. నిర్వాహక కమిటీ అధ్యక్షురాలు సీహెచ్ సుజాత, మహిళా ఉపాధ్యాయినులు నిర్మలాకుమారి, భాగ్యలక్ష్మి, అంజలి, కల్యాణి, రజియా, బషీర్ బేగం, చైతన్య దీప్తి, సంఘాల టీచర్లు జి.శ్యాంసన్, డి.సురేష్‌బాబు, జి.శ్రీనివాస్, కె.బాలకృష్ణ పాల్గొన్నారు.

మహిళల చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఆలమూరు: మహిళల రక్షణ కోసం రాజ్యాంగం కల్పించిన చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి దీపా దైవకృప అన్నారు. మండలంలోని చెముడులంక శ్రీషిర్డీసాయి విద్యానికేతన్, ఈశ్వర మహిళ జూనియర్ కళాశాల ఆవరణలో డైరెక్టర్ టి.ఉమారాణి అధ్యక్షతన నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహిళలంతా విద్య ద్వారానే సంపూర్ణ హక్కులు పొందగలుగుతారన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దని విజ్ఞప్తి చేశారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలమూరులోని వివిధ ప్రాంతాల్లో అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మహిళ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మండల, గ్రామ స్థాయి ప్రజా ప్రతినిధులు, అధికారులను ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ తదితరులు ఘనంగా సత్కరించారు. అలాగే ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలు జరిగాయి.

నేడు నూకాంబిక అమ్మవారి హుండీల లెక్కింపు

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి హుండీల లెక్కింపు గురువారం జరుగుతుంది. స్థానిక ఆలయ ఆవరణలో రామచంద్రపురం దేవస్థానం తనిఖీ అధికారి బాలాజీ రామ్‌ప్రసాద్, ఆలయ చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు ఆధ్వర్యంలో ఆలయంలోని హుండీలన్నింటికీ లెక్కింపు జరుగుతుందని ఈఓ ఉండవల్లి వీర్రాజు తెలిపారు. ఈ హుండీల లెక్కింపు చివరిసారిగా గత ఏడాది జూన్‌లో జరిగింది.

హోప్ హెల్పింగ్ ఫౌండేషన్ చేయూత

అయినవిల్లి: మండలంలోని కె.జగన్నాథపురం రాయివారిపేటకు చెందిన గూనపాటి వెంకటేశ్వరరావు(36) కొద్దిరోజుల కితం ఆకస్మికంగా మృతి చెందాడు. అతడికి భార్య, పిల్లలు ఉన్నారు. వీరికి స్వామి వివేకానంద సేవా సమితి, 4వ వార్డు సభ్యుడు, బీజేపీ నాయకుడు గనిశెట్టి వెంకటేశ్వరరావు(బాబి) అభ్యర్థన మేరకు ఉప్పలగుప్తం మండలానికి చెందిన హోప్ హెల్పింగ్ ఫౌండేషన్ 1500 విలువైన నిత్యావసరాలు అందజేశారు. ఈ సంస్థను గంగుమళ్ల శ్రీనివాస్ అభినందించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని వ్యక్తికి గాయాలు

అయినవిల్లి: మండలంలోని నేదునూరులో విద్యుత్ స్తంభాన్ని ఢీకున్న మోటార్ సైకిలిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని స్థానికులు అమలాపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యం కోసం తరలించారు. దీనిపై తమకు ఏ విధమైన ఫిర్యాదు అందలేదని అయినవిల్లి పోలీసులు తెలిపారు.

ఘనంగా మెహదీ అవతరణ దినోత్సవం



నగరంలో ఓడను ఊరేగిస్తున్న ముస్లింలు

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్య దైవం, చివరి ప్రవక్త ఇమామే జమానా అవతరణ దినోత్సవాన్ని నగరంలో బుధవారం ఆనందోత్సాహాలతో నిర్వహించారు. కల్కి భగవానుడిగా మెహిదీని ముస్లింలు నిండు మనస్సుతో ఆరాధిస్తారు. దీనిలో భాగంగా హుజ్జతీయ భవనం నుంచి మెహదీ వాహనమైన 'ఓడ'ను తీసి ఊరేగించారు. పూర్వీకుల ఆత్మశాంతి కోరుతూ వారి సమాధుల వద్ద పూజలు చేసి, బాణసంచా కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు. మామిడికుదురులోని బాషు పంజాలో మిలాద్ జరిగింది. పలువురు ఉర్దూ కవులు తమ కవిత్వాల ద్వారా ఇమామ్ మెహదీ మహిమలను వివరించారు. హుజ్జతీయ కమిటీ ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించిన అనంతరం ఓడను నగరం పీర్ల చెరువులో వదలి పెట్టారు. మామిడికుదురులోని బార్గాహే ఖమరే బనీ హాసిమ్ పంజాలో భక్తులకు ప్రసాదాలను పంచారు.

సామూహిక అక్షరాభ్యాసాలు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి సన్నిధిలో బుధవారం ఆలయ ప్రధానార్చకుల ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. అలాగే నామకరణలు, అన్నప్రాశనలు వంటి కార్యక్రమాలను నిర్వహించారు.

చైతన్య ప్రభు ఆవిర్భావ మహోత్సవం

అయినవిల్లి: నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిరంలో బుధవారం శ్రీచైతన్యమహాప్రభు ఆవిర్భావ మహోత్సవాన్ని శ్రీనివాస ప్రభుజీ ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. మహాహారతి, పుష్పాభిషేకం, సంకీర్తనలు, ప్రవచనం, మహాప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

గృహసారథులు, కన్వీనర్లు బాధ్యతగా పని చేయాలి



ఇరుసుమండలో గృహసారథులకు కిట్లను అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: గృహ సారథులు, కన్వీనర్లు బాధ్యతగా పనిచేసి మళ్లీ జగనన్న ప్రభుత్వం అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మొసలపల్లి, ఇరుసుమండ, ముక్కామల గ్రామాల్లో గృహ సారథులకు, సచివాలయ కన్వీనర్లకు జేసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్ అధ్యక్షతన సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ప్రజలతో మమేకమై ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ఒక్కో వలంటీర్‌కు ఇద్దరు చొప్పున గృహ సారథులను, సచివాలయానికి ముగ్గురు కన్వీనర్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 18 నుంచి వలంటీర్లతో పాటు గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ప్రభుత్వ పాలన పనితీరును వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లు వేటుకూరి వెంకట్రాజు, నాగవరపు నాగరాజు, బండారు మల్లి, దొమ్మేటి రాధాసూర్యనారాయణ, ఎస్.సత్యానందం, వనచర్ల విజయదుర్గ, నూకపెయ్యి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పాలనలో అన్ని వర్గాలకూ న్యాయం



సమావేశంలో బాబూరావును సత్కరిస్తున్న క్రైస్తవ సంఘాల ప్రతినిధులు

మామిడికుదురు: సీఎం జగన్ అన్ని వర్గాలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రతి ఒక్కరికీ న్యాయం చేశారని జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు కనపాల బాబూరావు అన్నారు. గోగన్నమఠం శివారు ముత్యాలపాలెంలో బుధవారం మండల పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం పాస్టర్ స్టీవెన్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు బాబూరావు సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ పాస్టర్లకు నెలకు రూ.అయిదు వేల గౌరవ వేతనం అందిస్తూ సీఎం జగన్ క్రైస్తవుల పక్షపాతిగా గుర్తింపు పొందారని అన్నారు. బాబూరావు మాట్లాడుతూ18 ఎమ్మెల్సీల్లో 14 ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. 2024లో వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారం చేపడుతుందన్నారు. దీన్ని సాధించే దిశగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు.అనంతరం ఆయనకు పూలమాల వేసి సత్కరించారు. సమావేశంలో పి.జోసఫ్, యు.ప్రతాప్, టి.నాని, సైమన్ విక్టర్, యు.మోసే, ఎల్.డేవిడ్ పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చేయూత

అమలాపురం రూరల్: మహిళలు ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం రుణాలు అందించి చేయుతనిస్తుందని డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ శివశంకర్ ప్రసాద్ అన్నారు. బండారులంకలో విజయదుర్గ మహిళా శక్తి సంఘం నిర్వహిస్తున్న జ్యూసీ కూల్‌డ్రింక్ సంస్థలో నూతనంగా కొనుగోలు చేసిన తయారీ యంత్రాలను బుధవారం ఆయన ప్రారంభించారు. జ్యూసీ కూల్‌డ్రింక్ సంస్థకు హైరాడార్ ఎంటర్‌ప్రెన్యూర్ పథకంలో భాగంగా మంజూరైన రూ.10 లక్షల రుణంతో యంత్రాలను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ యంత్రాలను ప్రారంభించి కూల్‌డ్రింక్ తయారీ విధానాన్ని పరిశీలించారు. కార్యక్రయంలో ఎల్.లక్ష్మీనారాయణ, హార్టికల్చర్ జేడీ మల్లికార్జున్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులు పోలీసు ఉద్యోగాలు సాధించాలి

అమలాపురం టౌన్: పేద విద్యార్థులను పోలీసు ఉద్యోగార్థులుగా చేయడమే శ్రీ ఎంపవర్మెంట్ చారిటబుల్ ట్రస్ట్ లక్ష్యమని విజయవాడ డీసీపీ మోకా సత్తిబాబు అన్నారు. శ్రీ ఎంపవర్మెంట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాల క్రీడా మైదానంలో బుధవారం జరిగిన పోలీస్ మాక్ టెస్ట్‌ను సత్తిబాబు జెండా ఊపి ప్రారంభించారు. పోలీస్ మాక్ టెస్ట్ సందర్భంగా హాజరైన 150 మందికి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోసంగి బంగార్రాజు, గెద్దం ప్రదీప్, తాడికోన సర్పంచ్ సూర్య వెంకట నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

అయినవిల్లి: మండలంలోని కె.జగన్నాథపురంలో స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయ ఆవరణలో వేంచేసిన అయ్యప్పస్వామి ఆలయ పదో వార్షికోత్సవం, స్వామిజన్మదిన వేడుకలను ఆలయ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసశర్మ బ్రహ్మత్వంలో స్వామికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు జరిపారు. భజన కార్యక్రమం, అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మల్లాది మల్లిబాబు, కంచర్ల నారాయణరావు, గంగుమళ్ల శ్రీనివాస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సురభి గోరక్షా దీక్షా యాగం

ముమ్మిడివరం: మండలంలోని చినకొత్తలంక పట్టాభిరామస్వామి, గణపతి, విజయదుర్గమ్మ వారి ఆలయంలో హైదరాబాద్‌కు చెందిన శ్రీమహి వరాహ ట్రస్టు ఆధ్వర్యంలో సురభి గోరక్ష దీక్షా యాగం బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బ్రహ్మశ్రీ కందుకుర్తి మహికిరణ్ శర్మ ఆధ్వర్యంలో లక్ష గో పిడకలతో పది రోజుల పాటు యాగం నిర్వహించనున్నారు. కిరణ్‌శర్మ మాట్లాడుతూ మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయం నుంచి అఖండ జ్యోతిని తీసుకొచ్చి హోమం ప్రారంభించామని చెప్పారు. పూజల్లో సర్పంచ్ పొత్తూరి ఉమారాణి, పీటీవీ వర్మ, పి.వీణారాణి, సమరసత సేవా సమితి ఫౌండేషన్ కన్వీనర్ పచ్చమట్ల సీతామహాలక్ష్మి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
మలికిపురం బ్రాంచ్, మలికిపురం, కోనసీమ జిల్లా

స్వాధీనత ప్రకటన (చర మరియు స్థిరాస్తుల కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారము **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మలికిపురం బ్రాంచ్, మలికిపురం, కోనసీమ జిల్లా.,** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 సందలి సెక్షన్ 13(2)కు అనుబంధమైన రూలు 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీత: శ్రీమతి తెన్నేటి విజ్ఞాన లక్ష్మి, భర్త : తిరుమలయ్య, కేరాఫ్ : వెంకటరత్నం,** డి.నెం.6-9, మోరి చెరువుగట్టు, మోరి, సఖినేటిపల్లి మండలం, కోనసీమ జిల్లా., **హామీదారు: శ్రీమతి నక్కా పద్మావతి,** భర్త : వెంకట శ్రీనివాసరావు, డి.నెం.1-52, మూడుతూములు, సఖినేటిపల్లి మండలం, కోనసీమ జిల్లా., **(హెచ్‌టిఎల్ & హోమ్ ఈక్విటీ అకౌంట్ నెం. 31058914440, 33900392987)** వారు **తేది.18-11-2022** నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ.2,71,675/-** (అక్షరాల రెండు లక్షల డెబ్బై ఒక్క వేల ఆరు వందల డెబ్బై ఐదు రూపాయలు మాత్రమే) + వడ్డీ, కాస్ట్సు మరియు ఇతర ఖర్చులతో కలిపి నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **తేది.16-12-2022న డిమాండ్ నోటీసు (సంక్షిప్త)** జారీ చేయబడినది.

ఋణగ్రహీత/ హామీదారు బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టములోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సదరు రూల్సు సందలి రూల్సు 8 మరియు 9 ప్రకారము **తేది.03-03-2023** దిగువ పేర్కొన్న ఆస్తిని **నిర్మాణాత్మక స్వాధీనత** తీసుకోవడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీత/ హామీదారు మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా **తేది.18-11-2022** నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ.2,71,675/-** (అక్షరాల రెండు లక్షల డెబ్బై ఒక్క వేల ఆరు వందల డెబ్బై ఐదు రూపాయలు మాత్రమే) + వడ్డీ, కాస్ట్సు మరియు ఇతర ఖర్చులు **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వారి ఛార్జీకి లోబడి వుండునని ఇందుమూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.తరువాత చెల్లించిన మొత్తములు తీసివేయబడును.

SARFAESI చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనల ప్రకారం ఋణగ్రహీతలు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవడానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించడమునకై శ్రద్ధ వహించవలెను.

చర మరియు స్థిరాస్తుల వివరములు

శ్రీమతి తెన్నేటి విజ్ఞాన లక్ష్మి, భర్త : తిరుమలయ్య గారికి చెందిన ఆస్తి:
తూర్పు గోదావరి జిల్లా, సఖినేటిపల్లి మండలం, మోరి గ్రామం, మలికిపురం ఎస్ఆర్ఓ పరిధి జడ్ డ్రై ఆర్.ఎస్.నెం.185/2 లోని ఎ.0.18 సెంట్లు మొత్తం విస్తీర్ణంలో ఎ.0.02.1/2 సెంట్లు (121 చ॥గ॥లు) విస్తీర్ణం గల భూమి అందు గల ఆర్‌సిసి భవనం యావత్తు ఆస్తి. **హద్దులు: తూర్పు:** బాసిం తాతారావు గారి భూమి, **దక్షిణం:** పిండి నాగమహాలక్ష్మి గారి భూమి, **పడమర:** శ్రీమతి చుట్టుగుల్ల పుల్లమ్మ గారి భూమి, **ఉత్తరం:** సన్నమండ శివ శంకర్ గారి భూమి.

తేది : 03-03-2023
ప్రదేశం : మలికిపురం

అధీకృత అధికారి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా